క్లుప్తంగా

శాంతి ప్రదర్శన రేపు

నెల్లూరు (బృందావనం): మిలాద్ ఉన్ నబిని పురస్కరించుకుని నగరంలో సోమవారం సాయంత్రం శాంతి ర్యాలీ జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముస్లిం యూత్ సేవ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీద్ తెలిపారు. బారాషహీద్‌దర్గా వద్ద శనివారం విలేకరులతో ఖలీద్ మాట్లాడుతూ ఏటా నిర్వహించే విధంగా ఈ ఏడాది మిలాద్ ఉన్ నబి జులూస్ (శాంతి ప్రదర్శన) కామాటివీధిలోని ఆయేషా మసీద్ నుంచి ప్రారంభమవుతుందన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు సిటీ: గణేష్ నిమజ్జనంలో ఓ వ్యక్తిపై కొందరు దాడిచేసి గాయపరిచిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. నగరంలోని కామాటివీధికి చెందిన రాజశేఖర్ ఈ నెల 12వ తేదీ గణేష్ నిమజ్జనోత్సవం వెంట వెళ్తుండగా మనుమసిద్ధినగర్‌కు చెందిన కమల్, గణేష్‌లు డీజే విషయంలో కొంత మందితో గొడవ పడ్డారు. రాజశేఖర్ గొడవ సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. కమల్, గణేష్, మరో నలుగురు కలిసి రాజశేఖర్‌తో గొడవ పడి కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. గాయపడిన రాజశేఖర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై శనివారం చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

683 విద్యుత్ చౌర్యం కేసుల రాజీ

- రూ.11,63,000 జరిమానా విధింపు



విద్యుత్ చౌర్యం కేసులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి యామిని

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో జిల్లా సర్కిల్ పరిధిలో 683 విద్యుత్ చౌర్యం కేసులను రాజీ చేశారు. ఆయా కేసులకు సంబంధించి రూ.11,63,000 జరిమానా రూపంలో వసూలు చేశారు. జిల్లా జడ్జి యామిని మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా అత్యధికంగా విద్యుత్ చౌర్యం కేసులను రాజీ చేయడం మంచి పరిణామం అన్నారు. ఇందుకు కృషి చేసిన ఫుల్ అడిషనల్ చార్జి ఆఫ్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి గీతా, మూడో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి ప్రిసైడింగ్ ఆఫీసర్ ఆఫ్ లోక్‌అదాలత్ రిలేటెడ్ ఎలక్ట్రిసిటీ కేసెస్ ఎల్. తేజోపతి, జిల్లా లోక్ అదాలత్ సెక్రటరీ కె.వాణి ఇన్‌చార్జి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె రమేష్ రెడ్డి, విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి, అధికారులను ఆమె అభినందించారు.

వైద్యులకు ఆదర్శప్రాయుడు డాక్టర్ నరసింహశాస్త్రి

నెల్లూరు (అర్బన్): ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ పీవీ నరసింహశాస్త్రి ఆదర్శప్రాయుడని వీఆర్‌సీ వాకర్స్ లాఫింగ్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉద్యోగ సంఘాల మాజీ వైస్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. శనివారం నగరంలోని వీఆర్‌సీ గ్రౌండ్‌లో క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ నరసింహశాస్త్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దాస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి, క్లబ్ గౌరవాధ్యక్షుడు, న్యాయవాది నన్నేసాహెబ్, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ సులోచనమ్మ, డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, నాయకులు జీఎస్ ప్రసాద్, ఆజాద్ జాకీర్ పాల్గొన్నారు.

ప్రాణాలు నిలపడంలో ప్రథమ చికిత్స కీలకం

నెల్లూరు(అర్బన్): అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలు కాపాడడంలో ప్రథమచికిత్స కీలకమని పల్మనాలజిస్ట్ డాక్టర్ కళ్యాణి అన్నారు. పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని (ఫస్ట్‌ఎయిడ్ డే) శనివారం నగరంలోని ముత్తుకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవత్స చెస్ట్ క్లినిక్‌లో నిర్వహించారు. డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ క్లిష్ట సమయంలో గ్రామీణ ప్రాథమిక వైద్యులు చేసే చిన్న చికిత్సతో వారి ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. డాక్టర్ కె.చిరంజీవి మాట్లాడుతూ తీవ్ర అస్వస్థకు గురైన వారిని కాపాడడంలో తొలి చికిత్స విధానాలు వివరించారు. డాక్టర్లను పీహెచ్‌పీ నాయకులు సన్మానించారు. పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శేషయ్య, నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, రామదాసు, పెంచలయ్య, శంకరరావు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు ఘనంగా సీమంతాలు

నెల్లూరు(అర్బన్): గిరిజన గర్భిణిలను గుర్తించి వారికి సీమంతాలు జరపడం ఎంతో సంతోషకరమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో శ్రీ పరంజ్యోతి మానవ సేవాసమితి, జయభారత్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు జరిపారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ పుట్టా శేషు మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 150 మంది మహిళలకు రూ.600 విలువ చేసే పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింహపురి వైద్యసేవా సమితి చైర్మన్ పొన్నలూరి సీతారామిరెడ్డి, జనరల్ మేనేజర్ గురుప్రసాద్, సేవకులు అనంగి రమణయ్య, భారతీజీ, కిశోర్‌జీ, అనిత, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల టీచర్ల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- 'అపస్మా' ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ ప్రదానం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చిత్రంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, నివేశన స్థలాలు ప్రభుత్వం నుంచి అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం పురమందిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్స్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. నెల్లూరు నగర పరిధిలో 60 పాఠశాలలకు చెందిన 130 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అపస్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించుకోవడం హర్షణీయమన్నారు. అపస్మా ఆర్గనైజేషన్ ఐక్యతగా మెలుగుతూ ప్రైవేట్ స్కూల్స్ అన్నింటిని ఏకతాటిపై నడిపించడం అభినందనీయమన్నారు. కోవిడ్, ప్రకృతి విపత్తుల సమయంలో సేవా కార్యక్రమాల్లో సైతం అపస్మా నిర్వహించిన పాత్ర ఎనలేనిదన్నారు. విశిష్ట అతిథి పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అపస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల మనుగడకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి అపస్మా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నెల్లూరు నగరంలో బెస్ట్ టీచర్స్ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీధర్, నెల్లూరు నగర అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న మహ్మద్ రఫీ 'మ్యూజికల్ నైట్'



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నేత సమీ

నెల్లూరు (బారకాసు): ప్రముఖ గాయకుడు దివంగత మహ్మద్ రఫీ 44వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 21న మహ్మద్ రఫీ 'మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్లు ముస్లిం మైనార్టీ నేత సయ్యద్ సమీ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రముఖ గాయకుడు జావీద్ ఆధ్వర్యంలో 31 ఏళ్ల నుంచి యాదే రఫీ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా నెల్లూరు నగరంలోని టౌన్ హాల్‌లో ఆ రోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో కార్యక్రమ నిర్వాహకుడు, ప్రముఖ గాయకుడు జావిద్, జీలు, మున్నా, మహబూబ్‌బాసా, అమానుల్లాఖాన్, ఖలీల్‌భాయి పాల్గొన్నారు.

బాలకృష్ణారెడ్డికి పరామర్శ



బాలకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తదితరులు

నెల్లూరు (అర్బన్): కరోనా సమయంలో సేవలు అందించిన మానవసేవయే.. మాధవ సేవ సంస్థ నిర్వాహకుడు అయ్యప్పనేని బాలకృష్ణారెడ్డిని శనివారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని నివాసంలో ఏపీజీఈఎఫ్, హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ రావు, ట్రెజరీ అసోసియేషన్ జిల్లా నేత వీవీ రమణారావు పరామర్శించారు. బాలకృష్ణారెడ్డి తల్లి సరోజనమ్మ మూడు రోజుల క్రితం మృతి చెందారు. చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ బాలకృష్ణారెడ్డి అందించిన సేవా కార్యక్రమాలకు ఆమె తల్లి సరోజనమ్మ స్ఫూర్తి అన్నారు. ఆమె నేత్రాలను కుమారులు దానం చేసి ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పరిమళ, ఇందిర, కల్పం శ్రీనివాసులు, విజయమ్మ, విశ్వనాథరావు, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నారాయణలో ఘనంగా సక్సెస్ మీట్



విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నారాయణ సక్సెస్ మీట్-2024ను నిర్వహించారు. జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 300కు 300 మార్కులు సాధించిన ఎస్‌కే సూరజ్ తల్లిదండ్రులకు రూ.5 లక్షలు, నీట్ పరీక్షల్లో ఆల్ ఇండియ స్థాయిలో 720కు 715 మార్కులు సాధించిన కె.సందీప్‌చౌదరి తల్లిదండ్రులకు రూ.5 లక్షల చెక్కులను నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి అందజేశారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలు ఏవైనా నారాయణ విద్యార్థులే అగ్ర స్థానంలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ జయకుమార్‌రాయుడు, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, మహేష్, డీన్‌లు, ఏజీఎంలు, ప్రిన్సిపల్స్ అధ్యాపకులు వర్ధిని తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'కృతజ్ఞతార్పణ' పండగ



బుక్ స్టాల్ వద్ద సంఘ కాపరి, సంఘ పెద్దలు

నెల్లూరు (బృందావనం): నగరంలోని బాప్టిస్టు చర్చి డొనీహాల్ వార్షిక కృతజ్ఞతార్పణల పండగ వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. చర్చిలో వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి సంతోష, సహవాస కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. అనంతరం బైబిల్ క్విజ్, ఆటలు, పాటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘ కాపరి రెవరెండ్ కె.శ్యామ్‌సన్ కుమార్ వాక్యోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, చైర్మన్ బి.సురేంద్రబాబు, కోశాధికారి జీబీ విజయభాస్కర్, సంఘ పెద్దలు, స్త్రీల సమాజం నాయకులు, యువజనులు, సండే స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



హర్షవర్ధన్ (ఫైల్)

నెల్లూరు సిటీ: తనతో పాటు వచ్చిన 12 ఏళ్ల కుమారుడు అదృశ్యంపై తండ్రి హజరత్తయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఆత్మకూరు మండలంలోని గాండ్లవీదుకు చెందిన హజరతయ్య తన కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరుకు వచ్చారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో కనపడకుండా పోవడంతో తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17న శంకరమఠంలో చండీహోమం

నెల్లూరు(బృందావనం): మూలాపేట శంకరమఠం కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17న 140వ చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆ మఠం నిర్వాహకులు కొ్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు శనివారం తెలిపారు. భాద్రపదమాస పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 8 గంటలకు చండీ హోమం జరుగుతుందన్నారు. చండీ హోమంలో పాల్గొనే భక్తులు వివరాలకు 96528 60264, 99499 18358 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సోషల్ మీడియా వేధింపులపై మహిళ ఫిర్యాదు

నెల్లూరు సిటీ: కావలిలోని సోషల్ మీడియాలో ఓ వ్యక్తి వివాహేతర సంబంధాలపై తనను వేధిస్తున్నారంటూ బోగోలుకు చెందిన ప్రభావతి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మికి శనివారం నెల్లూరులోని ఆర్‌అండ్‌బీగెస్ట్ హౌస్‌లో వినతిపత్రం అందించింది. తాను కావలి నియోజకవర్గంలో ఐదున్నరేళ్లుగా వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు పేర్కొంది. హరీష్‌రెడ్డి కొంత మంది ఆకతాయిలతో కలిసి సోషల్ మీడియా వేదికగా అసభ్యకరంగా తనపై పోస్టులు పెడుతున్నాడని, పలుమార్లు అదే సోషల్ మీడియా వేదికగా ప్రతిఘటించినట్లు తెలిపింది. తాను రాసే వార్తలతో అక్కసు పెంచుకుని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపింది. అక్రమ సంబంధాలు అంటగడుతున్నారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు ఇస్తే స్పందించకపోగా, తనపై అక్రమ కేసులు నమోదు చేసి అని ఆమె ఆరోపణ చేసింది. పిన్ని బోయిన చరిత్‌కుమార్, చిలకపాటి మనోహర్, చిలకపాటి మధు కూడా తనను వేధించిన వారిలో ఉన్నారంటూ ఫిర్యాదులో పేర్కొంది.

47 వేల క్యూసెక్కుల వరద ప్రవాహంతో పంటలకు నష్టం

నెల్లూరు సిటీ: ఒక్కసారిగా 47 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో పంటలు మునిగి రైతులు నష్టపోయారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు నగరంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొన్న కురిసిన భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌కు భారీగా వరద పోటెత్తి పొలాలు ముంపునకు గురయ్యాయని, ప్రభుత్వం, అధికారుల అప్రమత్తతతోనే భారీ నష్టం తప్పిందని తెలిపారు. చింతపల్లి, వై.రామవరం, కేడీపేట ప్రాంతాల్లో ఒక్క రోజు కురిసిన 15 సెం.మీ వర్షంతో ఊహించని స్థాయిలో వరద వచ్చిందన్నారు. ఏలేరు వరద కాలువలో ప్రవాహ స్థాయిని 10 వేల క్యూసెక్కుల నుంచి 70 వేల క్యూసెక్కులకు పెంచేందుకు 2019లో తమ ప్రభుత్వం రూ.292 కోట్లు పనులకు టెండర్ పిలిచిందన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో కాలువ ఆధునికీకరణ పనులను మూలన పెట్టేసిందని ఆరోపించారు. గడిచిన ఐదేళ్లలో కేవలం రూ.20 వేల కోట్లు ఖర్చు పెట్టినా.. కోస్తా ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు.

రత్నంలో హిందీ భాషా దినోత్సవం



హిందీ భాషా దినోత్సవంలో విజేతలు

నెల్లూరు (టౌన్): స్థానిక కిషోర్స్ రత్నం స్కూల్‌లో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు భాషాంశాలు, వ్యాకరణాంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజేయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల, హిందీ ఉపాధ్యాయులు జిలానీబేగం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా

మెరైన్ డీఎస్పీ బాలరాజు

అల్లూరు: తీర ప్రాంతంలోకి సంఘ విద్రోహ శక్తులు చొరబడకుండా ప్రత్యేక నిఘాను ఉంచామని మెరైన్ డీఎస్పీ బాలరాజు తెలిపారు. మండలంలోని ఇస్కపల్లి తీరప్రాంతంలోని మెరైన్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సముద్ర మార్గం నుంచి సంఘ విద్రోహశక్తులు, స్మగ్లర్లు చొరబడకుండా ప్రత్యేక నిఘాను ఉంచామన్నారు. గణపతి ప్రతిమలను సముద్రంలో నిమజ్జనం చేసే సమయంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విశాఖపట్నం సౌత్ జోన్‌లోని మెరైన్ స్టేషన్లను తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతిపై కేసు నమోదు



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

నెల్లూరు సిటీ: నగరంలోని జీజీహెచ్ ప్రాంగణంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు ప్రభుత్వ ఆస్పత్రిలోని చిన్నపిల్లల ప్రసూతి విభాగం పేషెంట్ అటెండర్లు విశ్రాంతి తీసుకునే రేకుల షెడ్డులో ఈ నెల 11వ తేదీ రాత్రి గుర్తుతెలియని (60) వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండడంలో సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఆస్పత్రి సిబ్బంది ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అతని వద్ద ఎలాంటి ఆధారం లభించలేదు. ఆ వృద్ధుడికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే 0861-2328440, 9440700018 నంబర్లకు తెలపాలని సీఐ రోశయ్య తెలిపారు.

వీపీఆర్ కన్వెన్షన్‌లో జాబ్‌మేళా



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు సిటీ: వీపీఆర్ కన్వెన్షన్‌లో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. టెక్ మహీంద్ర కంపెనీ 350 మందిని రిక్రూట్ చేసుకోగా, శ్రీసిటీలోని హీరో మోటార్స్‌కు 326 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎంపికైన ఉద్యోగులకు ఎంపీ వీపీఆర్ సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డితో కలిసి నియామక పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ అన్నారు. జాబ్‌మేళాలో షార్ట్ లిస్ట్‌లో ఉన్న మరో 750 మందికి రెండు మూడు రోజుల్లో ఆఫర్ లెటర్స్ రానున్నాయన్నారు. ఎంపిక కాని యువతీ యువకులు నిరుత్సాహ పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ చైతన్య, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, అనీష్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, గుడి హరికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న ఉపాధ్యాయినులు

నెల్లూరు (టౌన్)/నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ సంబరాలల్లో భాగంగా శనివారం స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, రన్నింగ్ రేస్, జావెలిన్ త్రో తదితర పోటీలు జరిగాయి. 45 ఏళ్ల లోపు, 45 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, మాజీ ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, మాజీ కార్యదర్శి పరంధామయ్య ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడంతో మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల సంస్మరణ సభ నేడు



మాట్లాడుతున్న సురేంద్రనాథ్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఆదివారం జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల సంస్మరణ సభ జరగనుందని పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి కన్వీనర్ బి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం వర్ధమాన సమాజంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చలంచర్ల భాస్కరరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ, కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి వర్ధంతి సభ, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి తొలి వర్ధంతి సభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు.

యువత సన్మార్గంలో పయనించాలి

- అదే జమా అతె ఇస్లామి హింద్ లక్ష్యం
- రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఫాతిమా కౌసర్

నెల్లూరు(బృందావనం): యువతను సన్మార్గంలో పయనింపజేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నదే జమా అతె ఇస్లామి హింద్ లక్ష్యమని, ఆ దిశగా విస్తృత కార్యక్రమాలను మహిళా విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్నామని రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఫాతిమా కౌసర్ తెలిపారు. దేశవ్యాప్తంగా 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' నినాదంతో నెల రోజుల చైతన్య కార్యక్రమంలో భాగంగా జెండావీధి పీఎస్ఎం హైస్కూల్ ప్రాంగణంలో శనివారం బహిరంగ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో దిగజారుతున్న నైతిక విలువలు, మితిమీరిన స్వేచ్ఛతో కలిగే అనర్థాలను వివరించారు. యువత సమాజంపై బాధ్యతగా మెలగాలని ఫాతిమా కౌసర్ సూచించారు. ఆ సంస్థ రాష్ట్ర మహిళా సహాయ కార్యదర్శి జుహేదా మాట్లాడుతూ మానవత్వాన్ని చాటుతూ బాధ్యతలతో భావితరాల మనుగడకు నేటి యువత కార్యోన్ముఖులు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా, నగర నేతలు ఆయేషా కౌసర్, మలికా బేగం, ఆసియా, వహిదా బేగం, గౌహర్‌జాన్, అబిదాబేగం, సాహెబ్‌జాది, మజ్జభ్ సఫియా అఖ్తర్, హాజీర తస్కీన్, షంషాద్ బేగం, అస్మత్‌జహా, సమీనా, మొబీనాఖానం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్ గర్హనీయం

నెల్లూరు (బారకాసు): పౌరహక్కుల సంఘం బృందాన్ని మణుగూరు పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రటకనలో తెలిపారు. ఈ నెల 5న జరిగిన రఘునాథపాళెం బూటకపు ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వెళ్తున్న పౌరహక్కుల సంఘం నిజానిర్ధారణ కమిటీని తెలంగాణ ప్రభుత్వం అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం వ్యవహరిస్తామంటూనే ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలు తెలుసుకోకుండా పౌరహక్కుల సంఘం నాయకులను అడ్డుకోవడం రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేన్నారు.